
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



వీధి వ్యాపారులకు మళ్లీ రుణాలు..
పీఎం స్వనిధి పథకంలో వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలు గతేడాది నిలిచిపోగా, మళ్లీ ఇటీవల ప్రారంభమైంది. IIలో



జాతీయ రహదారులకు ప్రతిపాదనలు
జిల్లాలో మూడు రహదారులను ఎన్‌హెచ్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రిని కోరారు. IIలో

గరిష్టం / కనిష్టం
30°/ 24°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలాత్రిపుర సుందరీ దేవిగా పెద్దమ్మతల్లి

వైభవంగా ప్రారంభమైన శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మొదటి రోజున శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు గణపతి పూజ, పుణ్యావాచనం, రుత్వికరణ, దీక్షా వస్త్ర ధారణ, అఖండ దీపారాధన, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రజినీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు దంపతులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఏఎంవీఐల నియామకం



బాధ్యతలు చేపట్టిన ఏఎంవీఐలతో ఆర్టీఓ

కొత్తగూడెంటౌన్: జిల్లాకు కొత్తగా నియమితులైన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)లు సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ వి.వెంకటరమణ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. నూతనంగా నియమితులైన వారిలో రాజశేఖర్‌రెడ్డి, అశోక్, మానస, రాకేష్, శ్వేత ఉన్నారని, వీరిలో ఇద్దరు మహబూబాబాద్, ఇద్దరు మంచిర్యాల జిల్లాలకు, మరొకరు వరంగల్ జిల్లా వారని వెంకటరమణ తెలిపారు. ప్రతీ వాహనదారుడు తప్పకుండా పన్నులు చెల్లించాలని, లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ సక్రమంగా ఉండాలని అన్నారు.

ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టాలి

డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

చుంచుపల్లి: గర్భిణులు, శిశువుల ఆరోగ్య సేవలపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మి అన్నారు. తమ కార్యాలయంలో సోమవారం సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ఆపరేషన్లు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణిని తప్పనిసరిగా నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని అన్నారు. ప్రతీ శిశువుకు పూర్తి స్థాయిలో టీకాలు వేయాలని, ఈ మేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో వైద్యాధికారులు పుల్లారెడ్డి, మహ్మద్ ఫైజ్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏదీ.. ఆనాటి జోష్ !

'బజార్' దుకాణాలకు పండగ కళ వచ్చేనా ?

- సంప్రదాయ మార్కెట్‌కు గడ్డు రోజులు
- ఆన్‌లైన్, బడా మాల్స్ వైపే వినియోగదారుల మొగ్గు
- ధరల సవరణపై మార్కెట్ వర్గాల దృష్టి



పండగ కళ లేని కొత్తగూడెం చిన్న బజార్‌లోని దుకాణాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ ప్రకటించగానే సంప్రదాయ మార్కెట్‌లో ఒక్కసారిగా జోష్ వచ్చేది. అయితే కొన్నేళ్లుగా ఆన్‌లైన్ మార్కెట్, బడా షాపింగ్ మాళ్లు జిల్లాలో పాగా వేయడంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. కాగా ఈ సారి ఆన్‌లైన్, బడామాల్స్‌కు దీటుగా తాము కూడా ధరల యుద్ధానికి సై అంటున్నాయి సంప్రదాయ మార్కెట్ వర్గాలు.

పది రోజుల ముందే..

దసరా పండగ వస్తోందంటే సంప్రదాయ మార్కెట్లు కొత్తకళ సంతరించుకునేవి. కొత్తగూడెంలో ఎంజీరోడ్డు, చిన్నబజార్, పెద్ద బజార్, భద్రాచలంలో యూబీ రోడ్డు, పాల్వంచలో శాస్త్రిరోడ్, ఇల్లెందులో ఆంబజార్, మణుగూరు మెయిన్‌రోడ్లలో షాపులన్నీ వినియోగదారులతో నిండిపోయేవి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు షాపుల యజమానులు రకరకాల ప్రయత్నాలు చేసేవారు. తాము అందిస్తున్న ఆఫర్లు, ప్రత్యేక బహుమతులు, లక్కీడ్రాకు సంబంధించిన వివరాలతో భారీ హోర్డింగులు ఏర్పాటు చేసేవారు. బ్యాండ్ మేళాలు, విచిత్ర వేషధారణతో మనుషులను షాపుల ముందు ఉంచి హంగామా చేసేవారు. పండగకు పది రోజుల ముందు నుంచే ఈ పరిస్థితి కనిపించేది. అటువైపు వాహనాల్లో వెళ్లడం కష్టంగా ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇటు వస్త్ర, అటు కిరాణా దుకాణాలు క్రమంగా ఆనాటి వైభవాన్ని కోల్పోతున్నాయి.

ధరల సవరణకు సై..

ఆన్‌లైన్ మార్కెట్, బడా షాపింగ్ మాళ్లతో పోల్చితే సంప్రదాయ మార్కెట్‌లో లభించే వస్తువుల ధరలు కొంత ఎక్కువగానే ఉంటున్నాయి. దీన్ని ఆసరా చేసుకుని వినియోగదారులను ఆకర్షించడం ద్వారా న్యూ ఏజ్ మార్కెట్ పుంజుకుంది. దీని దెబ్బకు నిన్నా మొన్నటి వరకు దుకాణాలు నిర్వహించే వ్యాపారులే ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. కానీ ఇప్పుడు వారికి సరుకులు సరఫరా చేసే బడా వ్యాపార సంస్థలకు సైతం ఈ సెగ తాకింది. గతంలో వలె భారీగా ఆర్డర్లు రావడం తగ్గిపోయింది. దీంతో ఆన్‌లైన్ మార్కెట్‌కు పోటీగా ధరల యుద్ధానికి సంప్రదాయ మార్కెట్ వర్గాలు, హోల్‌సేల్ వ్యాపారులు సై అంటున్నారు. ఈసారి పండగ సీజన్‌లో ఆన్‌లైన్, బడాషాపింగ్ మాల్స్‌కు దీటుగా తాము కూడా పోటీలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కువ వెరైటీలు.. తక్కువ ధరలు

స్మార్ట్ ఫోన్‌లు వచ్చాక జీవితంలో ఇంటర్నెట్ భాగమైంది. ఇంట్లోనే తీరికగా కూర్చుని వందల రకాల వస్తువులను సెర్చ్ చేసుకుని, ధరలను సరిపోల్చుకుని, ఆ వస్తువును వాడిన వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ తెలుసుకుని షాపింగ్ చేయడం ఎక్కువైంది. కాలు బయట పెట్టకుండానే ఇంటి వద్దకే వస్తువులు రావడం మొదలైంది. మరోవైపు పెద్ద నగరాలకే పరిమితమైన బడా షాపింగ్ మాళ్లు జిల్లాలకూ వచ్చేశాయి. కిరాణా వంటి నిత్యావసరాలతో పాటు పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ సరిపడ బట్టలు, బంగారం అమ్మే మాల్స్ కూడా వచ్చాయి. దీంతో సంప్రదాయ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు క్రమంగా తగ్గిపోతుండగా పండగ సీజన్‌లో కిటకిటలాడే బజార్లు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

ధరల దగ్గరే పేచీ



రెండేళ్ల క్రితం షూ కొనేందుకు దుకాణానికి వెళ్లా. ఎమ్మార్పీపై కొంత తగ్గించండి అని అడిగితే మా దగ్గర ఫిక్స్‌డ్ రేట్ అని షాపు యజమాని చెప్పాడు. అదే షూ మీద ఆన్‌లైన్‌లో మంచి డిస్కౌంట్ ఉంది. అప్పటి నుంచి క్రమంగా ఆన్‌లైన్‌లోనే కొనడం అలవాటైంది. ధరల విషయంలో ఆఫ్‌లైన్ మార్కెట్ వర్గాలు కొంత మారాల్సి ఉంది.

– కె.లక్ష్మణ్, వినియోగదారుడు, కొత్తగూడెం

మార్పు మొదలైంది



కొన్నేళ్లుగా ఆన్‌లైన్, బడా షాపింగ్ మాల్స్ నుంచి మాకు తీవ్రమైన పోటీ ఎదురైంది. దీని ప్రభావం సంప్రదాయ మార్కెట్‌లో రిటైలర్ నుంచి తయారీదారు వరకు అందరిపైనా పడింది. అందుకే ఈసారి నాణ్యమైన వస్తువులు తక్కువ ధరలో అమ్మాలనే వ్యూహంతో ముందుకు వస్తున్నాం.

– మొరిశెట్టి భవానీ ప్రసాద్, వ్యాపారుల సంక్షేమ సంఘం కన్వీనర్, కొత్తగూడెం

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, మహిళా ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని, మహిళలకు ఎంతో ఇష్టమైన ఈ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన పాల్గొని మహిళా ఉద్యోగులతో ఆడిపాడారు. అనంతరం మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆటా, పాటలతో గౌరమ్మను కొలుస్తారని చెప్పారు. ఈ పండుగను ఘనంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజలంతా ఆనందంగా ఉండేలా బతుకమ్మ దీవెనలు అందించాలని ఆకాంక్షించారు. అంతకుముందు అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి పట్టణం, మండల కేంద్రం, గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకల కోసం తగిన ప్రదేశాలను గుర్తించి ముందుగానే లైటింగ్, సౌండ్ సిస్టమ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మహిళలు, పిల్లలు అధికంగా పాల్గొంటారని, భద్రతా చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, డీడబ్ల్యూఓ స్వర్ణలతా లెనీనా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, ఆయా శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మేకలు, గొర్రెల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో శిక్షణ పొందిన వివిధ శాఖల అధికారులు తిరుపతయ్య, కార్తీక్, హేమంత్‌కుమార్‌తో సోమవారం ఆయన సమావేశమయ్యారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను వారు కలెక్టర్‌కు వివరించారు. పర్యావరణానికి హాని కలగకుండా స్థానికంగా లభించే మట్టిని వినియోగించి గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలు, ఉపాధి కూలీలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలు నేర్చుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీలు, పశువుల పాకలు, పౌల్ట్రీ షెడ్ల వంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. స్థానిక జాతి మేకల అభివృద్ధికి మేలుజాతి పోతులను ఎంపిక చేసి ఏదైనా గ్రామంలో ఐదు పోతులు పంపిణీ చేసేలా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్యులు ఆనంద్, సంతోష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో అక్రమాలపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్య

మణుగూరు రూరల్: బీటీపీఎస్ సీఈపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల అధ్యక్షులు చందా లింగయ్యదొర జెన్‌కో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాంబాయిగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీటీపీఎస్ నిర్మాణంలో 641మంది ఆదివాసీలు భూములు కోల్పోతే, 73మందికే పరిహారం, ఉపాధి కల్పించారని అన్నారు. 357 మంది భూములు లేని గిరిజనేతరులకు ప్యాకేజీతోపాటు ఉద్యోగం కల్పించారని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న సీఈపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు గొగ్గల రామకృష్ణ దొర, కొమరం శ్రీను, కుంజా వెంకటరమణ, చిడెం నాగేశ్వరరావు, మడి గౌతమి, గోపాల్, కుంజా ఆదిలక్ష్మి, పి.విజయలక్ష్మి, మంగమ్మ, రజిని పాల్గొన్నారు.

నేడు అభయహస్త ధారిణిగా ఆదిలక్ష్మి

రామాలయంలో ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : రెండు చేతుల్లో పద్మాలు ధరించి వరద, అభయ హస్తాలతో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మంగళవారం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చే అమ్మవారిని తొలిరోజు ఆదిలక్ష్మిగా అలంకరించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు ఉపాలయం వద్ద ప్రత్యేక వేదిక సిద్ధం చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, చిత్రకూట మండపంలో రామాయణ పారాయణం జరపనున్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సోలార్ విద్యుత్‌తో ఏడాదికి రూ.200 కోట్లు ఆదా

- త్వరలో పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటుకు చర్యలు
- సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్ తిరుమలరావు వెల్లడి

సింగరేణి(కొత్తగూడెం): 2026 – 27 నాటికి సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 505.05 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నెట్ జీరో దశకు చేరుకుంటుందని డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) మోకాళ్ల తిరుమలరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివిధ ఏరియాల్లో 505.05 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 245.05 మెగావాట్ల ప్లాంట్లను ఏర్పాటు చేశామని, తద్వారా రోజుకు 10.68 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా సంస్థకు ఏడాదికి రూ.200 కోట్ల లాభం వస్తోందని వెల్లడించారు. మిగతా 259.05 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా సాగుతోందన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సోలార్ విద్యుదుత్పత్తి, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ తదితర రంగాల్లోనూ అడుగు పెట్టాలని భావిస్తోందని తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సింగరేణి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఎస్టేట్స్ విభాగాల ద్వారా సర్వే చేయిస్తున్నామని, బంకులు ఏర్పాటైతే 500 మందికి ఉపాధి కలుగనుందని తెలిపారు. ఒడిశాలోని నైనీబ్లాక్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైందని, అయితే ఈ బొగ్గు రవాణాకు రోడ్లు సరిగా లేనందున అడ్డంకులు ఎదురవుతున్నాయని, రహదారుల ఏర్పాటుపై ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారని వివరించారు.

ఆయిల్‌పామ్ రైతులకు అగచాట్లు !

- అధికారులకు ముందస్తు ప్రణాళిక లేదనే ఆరోపణలు
- బారులుదీరుతున్న గెలల ట్రాక్టర్లు
- రవాణాను అడ్డుకున్న రైతులు





అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు (ఇన్‌సెట్) మేనేజర్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ అధికారులు, పాలకులకు ముందస్తు ప్రణాళిక లేకనే అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు నిత్యం ఇక్కట్ల పాలవుతున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి.. గంటకు 5టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో అశ్వారావుపేటలో ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని ప్రారంభించారు. దశల వారీగా సామర్థ్యాన్ని పెంచుతూ ప్రస్తుతం గంటకు 30 టన్నుల ప్రకారం రోజుకు సరాసరి గరిష్టంగా 500 టన్నుల సామర్థ్యంతో ఫ్యాక్టరీ నడుస్తోంది. కానీ అశ్వారావుపేట ఫ్యాక్టరీ పరిధిలో రోజుకు వెయ్యి టన్నుల గెలలు దిగుబడి వస్తుండడంతో అధికారులు గత మూడు రోజులుగా హార్వెస్టింగ్ హాలిడే ప్రకటించి సోమవారం నుంచి గెలలు తీసుకుంటున్నారు. మూడు రోజులు గెలలు నరకకపోవడం, నరికినా తోటల్లోనే ఉంచుకోవడంతో గెలల నుంచి గింజలు రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒకే రోజు ట్రాక్టర్లు భారీగా రావడంతో క్యూలో గంటల తరబడి వేచి ఉండలేక అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఓ రైతు ఫ్యాక్టరీ గేటుకు ట్రాక్టర్‌ను అడ్డుగా నిలిపి ఆందోళనకు దిగారు. దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఆలస్యం కాకుండా వెంటనే అన్‌లోడ్ చేసుకుంటారని, అశ్వారావుపేట ఫ్యాక్టరీలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను, ట్రాక్టర్ డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆ తర్వాత మేనేజర్ నాగబాబుతో వాగ్వాదానికి దిగారు. దీనికి మేనేజర్ స్పందిస్తూ అప్పారావుపేట ఫ్యాక్టరీ 90 టన్నుల సామర్థ్యంతో నడుస్తున్నందున ఎన్ని గెలలు వచ్చినా దిగుమతి చేసుకుంటారని, అశ్వారావుపేట ఫ్యాక్టరీ 30 టన్నుల సామర్థ్యంతో నడుస్తున్నందున రోజుకు 500 టన్నుల గెలులు మాత్రమే తీసుకోగలమని చెప్పారు. సోమవారం సాయంత్రానికి 350 టన్నుల గెలలు దిగుమతి చేసుకున్నామని, ఇంకా తీసుకునేందుకు కూడా సిద్ధంగానే ఉన్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఏటా ఇవే తిప్పలు..

వర్షం పడిందంటే చాలు ఫ్యాక్టరీ నుంచి జాతీయ రహదారి వరకు ఒక్కోసారి కిలోమీటర్ మేర గెలల ట్రాక్టర్లను క్యూలో నిలపాల్సి వస్తోంది. అశ్వారావుపేట పరిసరాల్లో ఆయిల్‌పామ్ తోటలను విస్తరిస్తున్న క్రమంలో గెలల దిగుబడికి అనుగుణంగా ఫ్యాక్టరీని ఆధునికీకరించలేదు. గంటకు 30 టన్నుల క్రషింగ్‌కు మించి విస్తరించడానికి 20 ఏళ్ల క్రితం నాటి పరిశ్రమ భాగాలు సహకరించవు. ఇప్పటికే అప్పుడప్పుడు ఆగుతూ సాగుతూ.. రోజుకు 500 టన్నుల గెలల క్రషింగ్ చేయడమే గొప్ప అని చెప్పొచ్చు. ఈ ఫ్యాక్టరీని అలాగే ఉంచి కొత్తగా 120 టన్నుల సామర్థ్యంతో మరో ఫ్యాక్టరీని నిర్మించడం తప్పితే వేరే ప్రత్యామ్నాయమే లేదని రైతులు అంటున్నారు. ఈ మేరకు ఆయిల్‌ఫెడ్ అధికారులు సైతం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఎవరు మోకాలడ్డారో తెలియదు కానీ.. ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఆయిల్‌ఫెడ్‌లో ప్రాధాన్యతలు మారాయని రైతులు ఆరోపిస్తున్నారు. అశ్వారావుపేటలో నిర్మించాల్సిన రెండో ఫ్యాక్టరీని అప్పారావుపేటకు తరలించడం వెనుక ఉన్న శక్తులే అశ్వారావుపేటలో మూడో ఫ్యాక్టరీని కూడా అడ్డుకుంటున్నాయని అంటున్నారు. ప్రాంతీయ విబేధాలు, రాజకీయాలకు అతీతంగా అశ్వారావుపేటలో 120 టన్నుల సామర్థ్యంతో ఫ్యాక్టరీ నిర్మిస్తే సీజన్‌లో కొత్త దాంతో, అన్‌సీజన్‌లో పాత ఫ్యాక్టరీతో క్రషింగ్ చేయొచ్చని అభిప్రాయపడుతున్నారు.

రీజియన్‌లో 6,376 మందికి లబ్ధి

సింగరేణి కార్మికులకు అందనున్న లాభాల బోనస్



సింగరేణి(కొత్తగూడెం) : గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన రూ. 6,394 కోట్ల నికర లాభంలో 34 శాతం కార్మికులకు బోనస్ చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దీంతో కొత్తగూడెం రీజియన్‌లోని 6,376 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఇల్లెందు ఏరియాలో 585 మందికి, కొత్తగూడెం కార్పొరేట్‌లో 1,109, కొత్తగూడెం ఏరియాలో 2,363, మణుగూరులో 2,321 మంది కార్మికులకు రూ.1,95,610 చొప్పున అందనున్నాయి. అయితే కార్మికులు 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేసినమస్టర్ల ఆధారంగా బోనస్ చెల్లిస్తారు.

రూ.8,289 అ'ధనం'..

2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో కార్మికుడికి రూ.1,87,321 బోనస్ చెల్లించారు. ఈ ఏడాది రూ.8,289 చొప్పున పెంచగా ఒక్కో కార్మికుడికి రూ.1,95,610 చొప్పున అందనున్నాయి. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ ప్రకటించగా.. ఇల్లెందులో 350 మందికి, మణుగూరులో 2 వేలు, కార్పొరేట్‌లో 1,500, కొత్తగూడెం ఏరియాలో 2,500 మొత్తం 6,350 మందికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా ఒక్కో కాంట్రాక్ట్ కార్మికుడు రూ.5వేల చొప్పున బోనస్ అందుకున్న విషయం తెలిసిందే. ఇక రెగ్యులర్ కార్మికులకు 1999 – 2000 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా లాభాల వాటాను బోనస్‌గా ప్రకటించారు. అప్పుడు ఒక్కో కార్మికుడికి రూ.2వేల చొప్పున అందగా.. ప్రస్తుతం రూ.2లక్షలకు చేరువలో కార్మికులు బోనస్ అందుకుంటుండడం విశేషం.

'ఆదికర్మయోగి'పై గ్రామాల్లో అవగాహన

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి



దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న రాహుల్, అధికారులు

భద్రాచలం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు నేరుగా అందించేందుకు చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలు, కార్యాచరణపై సంబంధిత అధికారులకు శిక్షణ పూర్తయిందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ అఫైర్స్ జోనల్ మేనేజర్ ప్రదీప్ కుమార్ సింగ్ సోమవారం పీఓను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా అభియాన్ పథకం కార్యక్రమ అమలు తీరు వివరాలను పీఓ ఆయనకు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు డీఎంటీలకు ప్రత్యేక శిక్షణ అందించి గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించామన్నారు. ప్రతి గ్రామానికి నోడల్ ఆఫీసర్‌ను నియమించి, పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కలిగేలా ప్రచారం చేశామని చెప్పారు. ఆ తర్వాత ప్రదీప్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామాల వారికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల గుర్తింపుకార్డులు ఈ పథకం ద్వారా అందుతాయని చెప్పారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి..

అర్హులైన ప్రతీ గిరిజనుడికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సిబ్బంది పని చేయాలని పీఓ రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, గురుకుల ఆర్‌సీఓ అరుణకుమారి, ఈఈ సత్యానందం, ఏఓ సున్నం రాంబాబు, అధికారులు భాస్కర్, ఉదయ్‌కుమార్, రాజారావు, లక్ష్మీనారాయణ, వేణు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్య సేవలో సంగీత దర్శకుడు



రామాలయంలో సంగీత దర్శకుడు బోలె షావలీ

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని దేవస్థానాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు బోలె షావలీ సోమవారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, సరెళ్ల నరేష్, కోటేష్, సత్యలింగం, వెంకటేష్, సుధాకర్, శ్రీనివాస్, నటరాజ్, గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ

ఇల్లెందు: వచ్చే నెల 11,12 తేదీల్లో నల్లగొండ జిల్లా బొట్టుగూడలో నిర్వహించే పీఓడబ్ల్యూ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ కోరారు. సోమవారం ఇల్లెందు ఎన్డీ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. సనాతన ధర్మం పేరుతో మత చాందసవాదం మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. పసి పిల్లలపై అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకపోతే సంక్షేమ అమలు చేయలేమని ప్రభుత్వాలు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాయని విమర్శించారు. 30 నుంచి 35 ఏళ్ల వయసులోనే ఎంతో మంది మహిళలు వితంతువులుగా మారడానికి, కుటుంబ కలహాలకు మద్యమే కారణమని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆదిలక్ష్మి, కల్తీ సుభద్ర, మోకాళ్ల సుగుణ, సరోజిని, భూలక్ష్మి, రాపర్తి లక్ష్మి, మంగ, సమ్మక్క పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: మొదటి రోజు సోమవారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి తెలిపారు. ఇంటర్‌లో 39 మంది అభ్యర్థులకు గానూ 24 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతిలో 36 మంది అభ్యర్థులకు గానూ 26 మంది హాజరయ్యారు. 10 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షకు 59 మంది విద్యార్థులకు గానూ 48 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రెండు సెంటర్లను సందర్శించారు.

కొనసాగుతున్న కిన్నెరసాని నీటి విడుదల

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 10 వేల క్యూసెక్కుల వరదనీరు వస్తుండటంతో సోమవారం నీటిమట్టం 406.50 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ మూడు గేట్లు రాత్రి సమయంలో ఎత్తివేసి 15 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

యూరియా సరఫరాను మెరుగుపరుస్తాం

జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు



గోదాంలో యూరియాను పరిశీలిస్తున్న అధికారులు

బూర్గంపాడు: యూరియా సరఫరాను మెరుగుపరిచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు అన్నారు. బూర్గంపాడులోని పీఏసీఎస్ గోదాం వద్ద జరుగుతున్న యూరియా విక్రయాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు వానాకాలం పంటలకు యూరియా సరఫరాలో కొన్ని ఇబ్బందులు కలిగాయని, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యూరియా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విక్రయాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు కోరుతున్నామని తెలిపారు. ఏఓ శంకర్, సొసైటీ సీఈఓ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

వీధి వ్యాపారులకు మళ్లీ రుణాలు..

- ఇటీవల బ్యాంకర్లు, మెప్మా అధికారులతో కలెక్టర్ సమావేశం
- మొదటి, రెండో విడత రుణాల మొత్తం పెంపు
- మూడో విడత రుణం చెల్లిస్తే క్రెడిట్ కార్డులు మంజూరు
- లోక కళ్యాణ్ మేళాలతో అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు



కొత్తగూడెంలో పూలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

కొత్తగూడెంఅర్బన్: పీఎం స్వనిధి పథకంలో వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలు గతేడాది నిలిచిపోయాయి. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని మున్సిపాలిటీల్లోని వీధి వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణాలు అప్‌గ్రేడ్ చేయడం, నూతన సాఫ్ట్‌వేర్ డిజైన్ వల్ల రుణాల మంజూరులో జాప్యం జరిగిందని మెప్మా అధికారులు తెలిపారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం రుణాల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కలెక్టర్ ఆధ్వర్యంలో బ్యాంకర్లు, మెప్మా అధికారులతో గత శనివారం సమావేశం నిర్వహించారు. రుణాల మంజూరు గైడ్‌లైన్స్‌ను బ్యాంకర్లకు అందజేశారు. 2024 డిసెంబర్ 31 నుంచి నిలిపివేసిన రుణాలు మళ్లీ ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కావడంతో వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే రుణ మొత్తం పెంచడంతో తమకు ఆసరా అవుతుందని పేర్కొంటున్నారు.

ఈసారి క్రెడిట్ కార్డు సైతం..

2020 నుంచి వీధి వ్యాపారులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తున్నారు. మొదటి రుణంగా రూ.10 వేలు ఇచ్చి, వాయిదాల పద్ధతిలో అది తిరిగి చెల్లించాక రెండో రుణంగా రూ.20 వేలు, మూడో రుణంగా రూ.50 అందించేవారు. తాజాగా మొదటి రుణాన్ని రూ.15వేలు, రెండో రుణంగా రూ.25వేలు, మూడో రుణంగా రూ.50 వేలు ఇవ్వనున్నట్లు గైడ్‌లైన్స్‌లో పేర్కొన్నారు. మూడో రుణం తిరిగి చెల్లిస్తే క్రెడిట్ కార్డు కూడా ఇవ్వనున్నారు. ప్రైవేటు మైక్రోఫైనాన్స్ నుంచి కాపాడేందుకు, తక్కువ వడ్డీతో రుణాలు పొంది ఆర్థికాభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వీధి వ్యాపారులకు ఈ రుణాలు మంజూరు చేస్తున్నారు.

కొత్తగా గ్రూపుల ఏర్పాటు..

వీధి వ్యాపారులు కొత్తగూడెం కార్పొరేషన్‌లో 11,142 మంది, మణుగూరులో 2,028, ఇల్లెందులో 1,875 మంది ఉన్నారు. కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీలో వీధి వ్యాపారులను గుర్తించాల్సి ఉంది. ఇప్పటివరకు మహిళలను గ్రూప్‌గా ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేసేలా మెప్మా అధికారులు కృషి చేస్తున్నారు. ఇక నుంచి వీధివ్యాపారులతో కూడా గ్రూప్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొదటగా ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో గ్రూప్‌లు ఏర్పాటు చేయనున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో లోక కళ్యాణ్ మేళా

రుణాల ప్రక్రియ తిరిగి ప్రారంభమైన విషయంపై అవగాహన కల్పించేందుకు మెప్మా ఆధ్వర్యంలో లోక కళ్యాణ్ మేళాలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగనుండగా, రుణ స్థాయి పెంపు, ఇతర మార్గదర్శకాలను మెప్మా అధికారులు వివరిస్తున్నారు. గతంలో రుణం తీసుకుని పూర్తిగా చెల్లించినవారు బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకుని సమీపంలోని మెప్మా కార్యాలయానికి వెళ్తే ప్రొసిడింగ్స్ ఇస్తారు. అవి తీసుకుని మళ్లీ బ్యాంక్‌లో అందజేస్తే రుణం మంజూరవుతుంది. కార్పొరేషన్‌తోపాటు మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో, బ్యాంకులలో మేళాలు నిర్వహిస్తున్నట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు. ఈ సారి ఫుడ్ సేఫ్టీ అధికారుల నుంచి వీధి వ్యాపారులకు సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం రుణల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా, కలెక్టర్ సమావేశం నిర్వహించి గైడ్‌లైన్స్ అందించినా బ్యాంకర్లు ఆంక్షలు పెడుతున్నారని వీధి వ్యాపారులు పేర్కొంటున్నారు. రుణంకోసం బ్యాంకులకు వెళ్తే ప్రక్రియ ఇప్పుడే ప్రారంభమైందని, అప్పుడే రుణాలు రావని, ఫోన్ చేసి సమాచారం ఇస్తామంటూ బ్యాంక్ అధికారులు జాప్యం చేస్తున్నారని వాపోతున్నారు.

జాతీయ రహదారులకు ప్రతిపాదనలు

- మూడు రోడ్లను అప్‌గ్రేడ్ చేయాలని సీఎంకు మంత్రి తుమ్మల వినతి
- తద్వారా పారిశ్రామిక ప్రగతి, పర్యాటక, ఆధ్యాత్మిక అభివృద్ధి

బూర్గంపాడు: జిల్లాలో మూడు రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ రహదారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల పలు ప్రతిపాదనలతో వినతిపత్రం అందించారు. పారిశ్రామిక కారిడార్, టూరి జం అభివృద్ధిలో భాగంగా సారపాక(ఎన్‌హెచ్-30) నుంచి ఏటూరు నాగారం(ఎన్‌హెచ్-183) వరకు ఉన్న రాష్ట్రీయ రహదారి(93కిలోమీటర్లు)ని నేషనల్ హైవేగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ రహదారిని అప్‌గ్రేడ్ చేస్తే సారపాక, అశ్వాపురం, మణుగూరు పారిశ్రామి కంగా, భద్రాచలం, మల్లూరు, మేడారం ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జగ్గయ్యపేట(ఎన్‌హెచ్-65) నుంచి వయా వైరా, కొత్తగూడెం(ఎన్‌హెచ్-30) వరకు 100కిలోమీటర్ల వరకు రాష్ట్రీయ రహదారినిజాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. సారపాక(ఎన్‌హెచ్-30) నుంచి బూర్గంపాడు, వెంకటాపురం, ములకలపల్లి, దమ్మపేట, జంగారెడ్డిగూడెం (ఎన్‌హెచ్-365) వరకు 90 కిలోమీటర్ల వరకురాష్ట్రీయ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని మంత్రి తుమ్మల కోరారు.

పారిశ్రామిక ప్రగతికి ఊపు

మూడు ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే జిల్లా ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోనుంది. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి మరింత ఊపందుకుంటుంది. ఇప్పటికే జిల్లాలో అనేక పరిశ్రమలున్నాయి. పారిశ్రామిక అభివృద్ధికి ఇంకా అవకాశాలు ఉన్నా జాతీయ రహదారులు, రైల్వే సౌకర్యం లేకపోవటంతో కొంత వెనకబడుతోంది. జిల్లాలోని భద్రాచలం, పర్ణశాల, మోతె, ఇరవెండి వంటి ఆధ్యాత్మిక ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి. భద్రాచలం నుంచి పర్ణశాల, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు రహదారిని కూడా జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారిగా మారితే ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి సాధిస్తాయని పేర్కొంటున్నారు. గౌరెల్లి (హైదరాబాద్) (ఎన్‌హెచ్ -93టీ) నుంచి మహబూబాబాద్, ఇల్లెందు, కొత్తగూడెం రహదారి జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని చాలాకాలం నుంచి ప్రతిపాదనలున్నాయి. ఈ రోజు జరిగిన సమీక్ష సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగకపోవటంతో ఈ ప్రాంత ప్రజలు నిరాశకు గురయ్యారు.

ఉమ్మడి జిల్లా క్రీడాజట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడా సంఘాల ఆధ్వర్యాన వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానం, పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా పాఠశాలల స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ జట్లు, అండర్-17, 19 ఉషూ జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. అండర్-19 బాలుర ఫుట్‌బాల్ ఎంపికలకు 50 మంది, ఉషూ ఎంపికలకు 45 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాగా, ఫుట్‌బాల్ జట్టు జనగామలో ఈనెల 24నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఉషూ జట్టు ఈనెల 25నుంచి మహబూబా బాద్ జిల్లా నెల్లికుదురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని క్రీడా సంఘాల కార్యదర్శులు ఎం.డీ.మూసాకలీం, పి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జట్ల వివరాలు...

ఉమ్మడి జిల్లా అండర్-19 ఫుట్‌బాల్ జట్టుకు ఎస్‌డీ.యాసిర్ పాషా, బి.భరత్‌కుమార్, హెచ్.సాయి స్రుజన్, జి.అభిరాం, టి.కార్తీక్, వి.శివగోపాల్, జి.ప్రణీత్, డి. ఆనంద్‌బాబు, సీహెచ్.చెన్నకేశవ్, కె.అఖిల్, పి. శ్రీహర్ష, హెచ్.రుత్విక్, సీహెచ్.ఆకాష్, టి.యశ్వంత్, ఈ.ఉదయ్‌రాం, జి.సిద్ధార్థ, కె.నిశాంత్ ఎంపికవగా, స్టాండ్ బైగా టి.హేమంత్, ఏ.మనోజ్, ఏ.ప్రేమ్‌కుమార్, ఏ.సానత్, బి.శ్యాంప్రసాద్‌ను ఎంపిక చేశారు. అలాగే, ఉషూ జట్టుకు సాయిమహర్షి, హర్షణ్, కె. చక్రధర్ ఆర్యన్, అభిషేక్‌గౌడ్, యజ్ఞసేన్, ఉమర్ రూఫ్, చైత్ర వర్షిణి, సంజన, భావన, జాస్మిన్, షేక్ ఫిరోజ్, ఎం.డీ ఫారూఖ్‌బేగ్ ఎంపికయ్యారు.

గుండాలలో కుండపోత వర్షం



వాగులో కొట్టుకుపోయి బోల్తా పడిన ట్రాక్టర్

వాగులో కొట్టుకుపోయిన ట్రాక్టర్

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు వర్షం కురవగా, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లు నీటితో నిండిపోయాయి. కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడు మెలికల వాగు, జల్లేరు, ఈదుల వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆళ్లపల్లి మండలం జిన్నెలగూడెం సమీపంలోని వాగులో ట్రాక్టర్ కొట్టుకుపోయింది. రాయపాడు గ్రామానికి చెందిన రైతు ఊకే పాపయ్య ట్రాక్టర్‌పై పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. జిన్నెలగూడెం వద్ద వాగు దాటుతున్న సమయంలో వరద పెరగడంతో రైతు వెంటనే పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ కొంత దూరం కొట్టుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

ఎస్పీ అభినందనలు



కోర్టు డ్యూటీ ఆఫీసర్లను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: అశ్వారావుపేట, మణుగూరు, కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో మర్డర్ కేసుల్లో నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీవీడీ లక్ష్మి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లావణ్య, విశ్వశాంతి, రాజారావు, కోర్టు డ్యూటీ అధికారులు అశోక్, హేమీలాల్, నాగేశ్వరావు, మోహన్, శోభన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కూడా కేసుల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ఎస్ఐ రాఘవ పాల్గొన్నారు.

సుత్తితో కొట్టి వ్యక్తి హత్య

పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రాంమోహన్‌రావు మృతదేహం

కొత్తగూడెంఅర్బన్: తలపై సుత్తితో ఓ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన కొత్తగూడెంలో సంచలనంగా మారింది. టిఫిన్ తింటున్న సమయంలో అకస్మాత్తుగా ఇంట్లోకి చొరబడి దారుణానికి పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గణేష్‌బస్తీకి చెందిన గుబ్బల రాంమోహన్‌రావు సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. ఆరు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందగా, గణేష్‌బస్తీలో ఇంటిని కొనుగోలు చేసి నివాసముంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి రాంమోహన్‌రావు, భార్య సావిత్రిలు టిఫిన్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి చేతిలో సుత్తి పట్టుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. దీంతో భయాందోళన చెందిన దంపతులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తప్పించుకునే ప్రయత్నంలో రాంమోహన్‌రావు ఇంటి బయటకు రావడంతో అతని తలపై సుత్తితో కొట్టి అతిదారుణంగా హత్య చేశాడు. నిందితుడు చుట్టుపక్కల వారిని కూడా కొంతదూరం వరకు పరుగెత్తించి ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ, వన్, టూ, త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితుడు రామవరం వైపు వెళ్లినట్లు గుర్తించారు. మృతుడు రాంమోహన్‌రావుకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు, భార్య సావిత్రి ఉన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం కుమారుడికి సింగరేణి ఉద్యోగం ఇచ్చాడు. కాగా రాంమోహన్‌రావు కొనుగోలు చేసిన ఇల్లు వివాదంలో ఉండటం లేదా వివాహేతర సంబంధమే కారణమనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

పాడె మోసిన ఎమ్మెల్యే జారె



పాడె మోస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జుజ్జూరు వెంకటనారాయణ(55) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. వెంకట నారాయణ పాడె మోసి అంతిమ వీడ్కోలు పలికారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నివాళులర్పించినవారిలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



క్షతగాత్రురాలిని తన కారులో ఎక్కిస్తున్న ఎమ్మెల్యే

క్షతగాత్రురాలిని కారులో ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

చంద్రుగొండ: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం అన్నపురెడ్డిపల్లి మండలం నుంచి చంద్రుగొండ వైపు వస్తున్నారు. అదే సమయంలో సీతాయిగూడెం వద్ద దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఏపీ రాష్ట్రం కుక్కునూరుకు చెందిన పూనెం ఓసమ్మ, భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో ఆమె తీవ్రగాయాలు కాగా, ఎమ్మెల్యే జారె బాధితురాలిని తన కారులో చంద్రుగొండ పీహెచ్‌సీ తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్ స్కీం మోసాలపై ఫిర్యాదు

ఇల్లెందు: ఇల్లెందులో ఓ ఆన్‌లైన్ కంపెనీ బోర్డు తిప్పేయడంతో పెద్ద సంఖ్యలో బాధితులు రోడ్డున పడ్డారు. ఈ మేరకు పరదేవీ బస్తీకి చెందిన కిరణ్ పాసీ, కళ్యాణ్ పాసీ, బాలప్రసాద్ పాసీ, లక్ష్మీనారాయణలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన శంకర్, బిస్వాస్‌తోపాటు మరికొందరు ఆన్‌లైన్ స్కీం ప్రతినిధులు ఆన్‌లైన్ కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలువురి నుంచి రూ.17,500 వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. కంపెనీ ప్రతినిధులుగా చెలామణి అయిన వారి అకౌంట్లు సీజ్ చేసి, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

డీర్ పార్కు సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన సిబ్బంది

పాల్వంచరూరల్: కిన్నెరసాని డీర్ పార్కు సిబ్బందికి హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కులో సోమవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. జింకల పోషణ, రెస్క్యూ విధానంపై జూపార్కు డైరెక్టర్, ఇతర అధికారులు అవగాహన కల్పించారు. యానంబైల్ సెక్షన్ ఆఫీసర్ కిషన్, బీట్ ఆఫీసర్ నరేష్, డీర్ పార్కు వాచర్లు ఇబ్రహీం, కళ్యాణ్ శిక్షణకు వెళ్లిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో సోమవారం ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గానుగపాడుకు చెందిన మొగలిపువ్వు నాగరాజు, తాటికూరి ఎల్లయ్య ద్విచక్రవాహనంపై సుజాతనగర్ నుంచి గానుగపాడుకు వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అన్నరంతండా వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వారిని అంబులెన్స్ ద్వారా మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఇల్లెందు: మద్యం తాగి వాహనం నడిపిన మండలంలోని మస్సివాగు గ్రామానికి చెందిన బోడ మల్సూర్‌కు ఇల్లెందు న్యాయమూర్తి సోమవారం నాలుగు రోజుల జైలు శిక్ష , రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇటీవల పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనం నడుపుతున్న మల్సూర్ పట్టుబడ్డాడు. సీఐ సురేష్ కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి కీర్తిచంద్రికరెడ్డి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఏజెన్సీలో వాహన తనిఖీలు

ఇల్లెందురూరల్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని ఇల్లెందు-గుండాల ప్రధాన రహదారిపై కొమరారం పోలీసులు సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాహనదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. తనిఖీల్లో కొమరారం ఎస్సై నాగుల్‌మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

చుంచుపల్లి: చుంచుపల్లి విద్యానగర్ బైపాస్ వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నారాయణపురం మండలం ఊకొండి గ్రామానికి చెందిన పోగుల సుభాష్ (42) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరి కవిత ఫిర్యాదుతో చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



సత్యనారాయణ(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వల్లపిన్ని సత్యనారాయణ(65) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకారం.. సత్యనారాయణ ఇంటి ఆవరణలో నూతనంగా తెచ్చిన వాటర్‌స్ప్రే మిషన్‌తో ట్రాక్టర్‌ను కడిగే ప్రయత్నం చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం తర్వాత సత్యనారాయణ దంపతులు హైదరాబాద్‌లో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అంతలోనే ఈ ఘటన జరగడంతో కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుడికి భార్య అరుణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సొసైటీ మాజీ చైర్మన్ పోలుదాసు క్రిష్ణమూర్తి, నున్నా రోశరావు, కాంగ్రెస్ నాయకులు నున్నా కృష్ణయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, మండల సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, గార్లపాటి వీరభద్రం సందర్శించి, సంతాపం తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

పాల్వంచరూరల్: తల్లిదండ్రుల ఇంటి స్థలం పంపకం విషయంలో అన్నదమ్ముల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన మాళోత్ వీరన్న, బాహుసింగ్ అన్నదమ్ములు. ఇంటి స్థలం విషయంలో గొడవపడి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆ ప్రకటనతో మాకు సంబంధం లేదు

మావోయిస్టు పార్టీ బీకే ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న

చర్ల: వారం రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ పేరుతో ఇచ్చిన ప్రకటన బూటకమని, ఆ ప్రకటన కు తమకు ఎటువంటి సంబంధం లేదని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతా రామరాజు జిల్లా డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పేరిట సోమవారం ఓ ప్రకటన విడుదలైంది. కొందరు పనిగట్టుకుని ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే విప్లవ పేరుతో ప్రకటన విడుదల చేశారని లేఖలో పేర్కొన్నారు. కాగా వారం రోజుల క్రితం విడుదల చేసిన లేఖలో బీకే ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి విప్లవ అని పేర్కొనగా, తాజాగా విడుదల చేసిన చేసిన లేఖలో అదే కమిటీకి లచ్చన్న కార్యదర్శి అని పేర్కొన్నారు. వాస్తవంగా బీకే ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా గడిచిన నాలుగేళ్లగా ఆజాద్ కొనసాగుతున్నారు. ఏరియా, డివిజన్, జిల్లాల కమిటీలు మార్పు చేసినట్లు ఇంతవరకు మావో యిస్టు పార్టీ ప్రకటించలేదు. ఒక్కో లేఖలో ఒక్కో పేరు ఉండటంతో గందరగోళం నెలకొంది. ఈ వ్యవహారంపై మావోయిస్టు పార్టీయే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఆయిల్‌పామ్ గెలల తిరస్కరణపై నిరసన



ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్ గెలల తిరస్కరణ పేరుతో ఒక్కో ట్రాక్టర్‌కు 50 కేజీల వరకు తగ్గించి, కాంటా రశీదును ఇస్తున్నారని గొర్రెగుట్ట గ్రామానికి చెందిన రైతు మల్లారెడ్డి రమణమూర్తి ఆరోపించారు. సోమవారం ఆయన ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. పలుకుబడి ఉన్న రైతులకు ఎలాంటి తిరస్కరణ లేదని, కేవలం సామాన్య రైతుల గెలలనే అధికారులు తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. తిరస్కరించిన గెలలను రైతులకు వెనక్కి ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్‌ను వివరణ కోరగా.. పచ్చి, పుచ్చు, పనికిరాని గెలలను పరిశీలించాకే సిబ్బంది కాంటాలో తగ్గించి రాస్తారని తెలిపారు.



● ఆస్కార్ ఎంట్రీ



"'జిన్ షిన్ జ్యుషు' అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్."

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను 'మీ ఊరికి పోండి' అని సాటి మనుషులే తరిమికొడితే 'ఇంటి వైపు' నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన 'హోమ్‌బౌండ్' ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా'ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.

■ అదే దర్శకుడికి అదే గుర్తింపు

'హోమ్‌బౌండ్' (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘేవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన 'మసాన్' సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే 'హోమ్‌బౌండ్'కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్‌బౌండ్' రెండవ స్థానంలో నిలిచింది. 'మసాన్' సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. 'టేకింగ్ అమృత్ హోమ్' అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో, వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి 'హోమ్‌బౌండ్'ను తీశాడు.

■ ఇద్దరు స్నేహితుల కథ

'హోమ్‌బౌండ్' షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ 'దేశం' అనే 'ఇల్లు' వీరికి 'కొందరికి' ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. 'కానిస్టేబుల్ ఉద్యోగం' వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వీ కపూర్ నటించింది. కరణ్ జోహర్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.

నవశక్తి

'ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..



ఫైర్ ముఖ్యం



"మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రైనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రైనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రైనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రైనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను" అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,16,410	1,14,500	1,13,070	1,14,500	1,15,200	1,13,020
బంగారం (22 క్యారెట్లు)	1,08,250	1,06,300	1,03,650	1,06,300	1,05,980	1,03,600
వెండి	1,39,000	1,36,400	1,48,000	1,36,400	1,37,000	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్ఐపీహెచ్ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సీ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.



సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.

మునగ మేలు!








మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్ళు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.

బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
సగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్ముకోవచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754